# రమణ భాస్కర

## (ఆకివీడులో శ్రీనాన్నగారి ప్రవచనము, 2-2-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

చైతన్యం యొక్క వెలుగు ప్రపంచంలో ప్రసరించి ఆ వెలుగు వలన ప్రపంచం ఉన్నట్లుగా మనకు కనబడుతోంది. దేని వెలుగు వలన మనం ప్రపంచమును చూస్తున్నామో దానినే మర్చిపోతున్నాము. అదే మనం చేసేపొరపాటు. మానవుడు చైతన్యస్థాయిని పెంచుకోవాలంటే మూడు అవస్థలు ఉన్నాయి. 1) తనను తాను పవిత్రం చేసుకోవటం 2) ఏ వస్తువును పొందాలి అనుకొంటున్నావో దానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని సంపాదించడం, దానిగురించి శ్రవణం చేయటం. శ్రవణం అంటే నీవు ఏవస్తువును పొందుదామని అనుకొంటున్నావో దాని గురించి వినటం శ్రవణం. దేహబుద్ధి పెరిగే మాటలు వినటం శ్రవణంకాదు. నిన్ను బంధించే మాటలు వినటం శ్రవణం కాదు. ఎవడైతే ఆ వస్తువును పొందాడో వాడి దగ్గర కూర్చొని వాడు చెప్పే మాటలు వినటం శ్రవణం. ఇది సాధనలో ఒక భాగం. 3) నువ్వు ఏ వస్తువు అయి ఉన్నావో దానిలో ఐక్యమవ్వటం. మీజీవితం చూస్తూ ఉంటే ఈ మూడు అవస్థలు నాకు కనిపించటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. నేను ఏమీ సాధనలు చేయలేదు, జపాలు, ప్రాణాయామం చేయలేదు. అంతేకాదు మేము జపంచేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము అని చాలా మంది వచ్చి చెపుతూ ఉండేవారు ఎప్పుడూ కూడా వాటి మీద నాకు ఆకర్షణ కలుగలేదు అన్నారు భగవాన్. ఏ వస్తువును పొందటానికి ఈ సాధనలు అన్నీ చేస్తున్నామో ఆ వస్తువే ఆయనకు తానుగా వ్యక్తమయింది కాబట్టి ఇటువంటి వాటిమీద ఆయనకు ఆకర్షణ కలుగలేదు. పని నిన్ను బంధించటం లేదు. నేను చేస్తున్నాను అనే తలంపే నిన్ను బంధిస్తోంది. కర్మఫలం ఆశించకుండా, కర్తృత్వం లేకుండా కర్మ చేస్తే అది కర్మయోగం అవుతుంది. భగవంతుడు ఏపని కోసం నియమించాడో ఆపనిని రాగద్వేషములు లేకుండా, కర్తృత్వం లేకుండా చేస్తే, అది సాత్విక కర్మ అవుతుంది. సాత్విక కర్మ అజ్ఞానములో నుండి, పునర్జన్మలో నుండి, బంధంలో నుండి నిన్ను విడుదల చేస్తుంది అని కృష్ణుడు చెప్పాడు. దేవుడు గురించి మీకు ఏమీ తెలియక పోయినా దేవుడు చెప్పిన పనులు చేసుకొంటూ పోతే మీరు దేవునిలో ఐక్యమవుతారు. దేవుడు ఉన్నాడా, లేడా అన్నది సమస్యకాదు. నీవు సహజంగా జీవిస్తే, కర్తృత్వంలేకుండా జీవిస్తే నీవు భగవంతునిలో ఐక్యమవుతావు. ఆధ్యాత్మిక జీవితం ప్రారంభ దశలో ఏమి చేయాలి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మామూలుగా అయితే పూజచేసుకో, జపంచేసుకో, ధ్యానం చేసుకో అని గురువులు చెపుతూ ఉంటారు. కాని భగవాన్ అలా చెప్పలేదు. ఏదో చెయ్యాలి అని ఎందుకు అనుకొంటున్నావు అన్నారు భగవాన్. ఆత్మజ్ఞానం పేరుమీద మానవుడిని మూర్ఖుడుగా తయారుచెయ్యటం కాదు. మీ చైతన్యస్థాయిని పెంచేవాడే గురువు. ఉన్నస్థితి నుండి క్రిందకు దిగజార్చేవాడు గురువు ఎలా అవుతాడు. మీ ఆలోచనలను చంపేవాడు గురువు ఎలా అవుతాడు. యోగాభ్యాసములు చేస్తున్నారు అనుకోండి వాటి వలన వచ్చే ప్రయోజనం నీకు కలుగుతుంది గాని ఆత్మజ్ఞానం నీకు ఎలా సిద్ధిస్తుంది అంటున్నారు. ఏ వస్తువును పొందుదామని అనుకొంటున్నామో

అది మనమే. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే దానిని మన కళ్ళతో చూడాలని ప్రయత్నం చేస్తున్నాము. కాని అది కళ్ళకు కనబడేది కాదు. అది చూచేదే కాని చూడబడేదికాదు. ఏదైతే నీవో నువ్వు అదిగా ఉంటే ఏమి చేయమంటారు అని నన్ను అడగవు. నీ జీవితంలో ఏదో వెలితి ఉంది. నువ్వు నువ్వుగా లేవు. నీలో వెలితి ఉంది. ఆ వెలితి వలన నన్ను ఏమి సాధన చేయమంటారు అని అడుగుతున్నావు. మానవుడికి కావలసినది శాంతి. నువ్వు నిజంగా శాంతిలో ఉంటే నన్ను ఏమి చేయమంటారు అని అడగవు. నీకు శాంతి లేదు. నీకు శాంతి కావాలి కాబట్టి ఏమిచేయమంటారు అని అడుగుతున్నావు. నీ బలహీనత ఏమిటో నీకు తెలియదా. దానిలో నుండి విడుదల పొందటానికి చేసే ప్రయత్నమే సాధన. నాకు కాల్లు బాధ పెడుతోంది అనుకోండి. ఆ నొప్పి నాకు తెలుస్తుంది. దానికి మందు వ్రాసుకొంటాను. అదే విధంగా ఏ కారణం వలన నీకు అశాంతి వస్తోందో అందులో నుండి విడుదల పొందమని నేను ప్రత్యేకంగా చెప్పటం ఎందుకు ? ఏ కారణంవలన నీకు అశాంతి కలుగుతోందో అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. నీవు పొందవలసింది ఎక్కడో బయట ఉంది అనుకొంటున్నావు. అది ఎక్కడో బయటలేదు. అది నీహృదయంలోనే ఉంది. నీగతి నీ హృదయంలోనే ఉంది. ఆ సద్గతిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. నీకు ఉన్న దురలవాట్లను తొలగించుకో. నేను అనే తలంపు ఏ అలవాట్ల మీద ఆధారపడి ఉందో వాటిని తొలగించు. నువ్వు నారమల్‌గా, నేచురల్‌గా జీవిస్తూఉంటే చైతన్యం నీకు వ్యక్తమవుతుంది. ఆధ్యాత్మికమార్గంలో నీవు పోగొట్టుకోవలసిందిఉందిగాని నీవు సంపాదించవలసింది ఏదీలేదు అంటున్నారు భగవాన్ ఈయన మోడరన్ మహర్షి. వేదాలలో లేని అందాలు చూడండి. అయితే మనకు దగ్గరగా ఉన్నపుడు వస్తువు యొక్క విలువ మనకు తెలియదు.

సంఘరహితునకు తత్వం తెలుస్తుంది. సంఘరహితుడు దానిని పొందాలి అని వాడుఅనుకోనక్కరలేదు. ఆవస్తువువే తానుగా వాడికి వ్యక్తమవుతుంది. చైతన్యమే వచ్చి వాడిని వరిస్తుంది. మనలో ఉన్న అపవిత్రత వలన దేవుడు మనలను అనుగ్రహించటంలేదు అనుకొంటాము. అనుగ్రహం లేని క్షణం అంటూలేదు. మనకు ఏదైనా మంచి జరిగితే అది దేవుని అనుగ్రహం అనుకొంటాము. చెడ్డజరిగితే దేవుని అనుగ్రహం మనమీద లేదు అనుకొంటాము. అదే మనలో ఉన్న చెడ్డ. ఏది జరిగినా భగవంతుని అనుగ్రహమే. ఈ శరీరంలో ఉంచినా ఆయన అనుగ్రహమే ఈ శరీరంలో నుండి ప్రాణం తీసివేసినా ఆయన అనుగ్రహమే. నీలో ఉన్న సమస్త వాసనలు నశించిన తరువాత దేహం ఉన్నా ఒకటే, దేహంపోయినా ఒకటే. దేహం ఉంటే పోవాలి అనుకోవు. దేహంపోతూఉంటే ఉండాలి అనుకోవు. దేహం ఉండటం వలన లాభంగాని, దేహంపోవటం వలన నష్టంగాని ఏమీ ఉండదు.

నువ్వు చైతన్యమే. కాని నేను చైతన్యమును అని నీవు అనుకోవటంలేదు. నేను దేహమును అని నీవు అనుకొంటున్నావు. అలా ఎవడు అనిపింపజేస్తున్నాడు? నీవు అలా అనుకోవటానికి కారణం ఏమిటి? దీనికి నీ మనస్సే కారణం. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు అదే సాధన. నువ్వు ప్రయత్నం చేస్తే గురువు సహాయం అందుతుంది. ప్రాణాయామం చేసినా, పూజలు చేసినా, జపాలు చేసినా చివరి మెట్టుమటుకు భగవంతుని అనుగ్రహం లేకుండా దాటలేము. భగవంతుని అనుగ్రహం లేకుండా మనం భగవంతుని పొందలేము. ఈ లోపుగా మనం చేసే సాధనలు చేస్తాము. ఆయన అనుగ్రహంలేకుండామటుకు చివరి మెట్టు దాటలేము. ఆయన అనుగ్రహంలేకుండా ఆయన స్వరూపమును పొందే అవకాశం లేదు. ఇది భగవంతుని రాజ్యాంగం. అందువలన ఈ లోకంలో మనం ఏ పని చేసినా ఆయన అనుగ్రహం పొందటం కోసం చేయాలి. అదే నిజమైన సాధన.

మీకు ఏమీ చెడ్డ అలవాట్లు లేవు ఏమిటి అని ఒక పెద్దలాయర్‌ను అడిగితే నా ప్రాక్టీసుకే నాకు టైము చాలటం లేదు. ఇంక చెడు అలవాట్లు ఏమిటి? అన్నారు. ఖాళీగా ఉన్న మనస్సుకే కామం వస్తుంది. సోమరిపోతుకే చెడ్డ అలవాట్లు ఉంటాయి. నా ప్రాక్టీసుకే టైము చాలటం లేదు ఇంక చెడు తలంపు రావటానికి అక్కడ ఖాళీలేదు అన్నారు. నీవు ఏమీ సంపాదించనక్కరలేదు నీదురభిప్రాయాలను, దురలవాట్లును పోగొట్టుకో. ఈశ్వరుని పట్ల నీకు ఉన్న ప్రేమ, భక్తి తైలధారవలె, నదీ ప్రవాహంలాగ ఉంటే ఈశ్వరుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు. అక్కడ ఉన్నది ఆనందమే ఆనందం, శాంతే శాంతి. అప్పుడు ఏదైనా కోరిక వచ్చినా అది అక్కడ ఉండటానికి అవకాశంలేదు, అది మాడిపోతుంది. మనకు జ్ఞానం కోవాలంటే పామరులతో సహవాసం వదులుకోవాలి. చేనులోనికి ఒక కంతలో నుండి నీరు వస్తూ ఉంటే ఇంకో కంతలో నుండి వదలివేస్తే నీరు చేనులో ఉంటుందా? ఉండదు. అలాగే సాధనచేసి, చేసి పామరులతో సహవాసంచేస్తే చేసిన సాధన అంతా పోతుంది అని చెపుతున్నారు.

ఏమనిషికి అయినా ఆత్మానుభవం కలుగకుండా ఆనందానుభవం కలుగదు. ఎందుచేతనంటే ఆత్మకు మరో పేరే ఆనందము. ఆత్మానుభవం లేనివాడికి ఎంత కీర్తి ఉన్నా, ధనం ఉన్నా వాడికి ఆనందం కలుగదు ఎందుచేతనంటే ఆత్మే ఆనందము. తలంపు ఎక్కడైయితే పుడుతోందో అక్కడ తలంపును అణచటం తేలిక. తలంపు విజృంభించి శిరస్సులోనికి వచ్చిన తరువాత దానిని అణచటం కష్టం. ఉన్నది చైతన్యం ఒక్కటే చైతన్యమునకు విరుద్ధంగా ఏ మాటలు చెప్పినా అటువంటి మాటలు నాతో చెప్పవద్దు అనేవారు భగవాన్. దానికి భిన్నంగా ఏది చెప్పినా అక్కడ **stop** చేసేవారు.

వివిధ సమస్యలకు పరిష్కారం ఒక్కటే. మొదట భగవంతుని అన్వేషించటం ప్రారంభించు. భగవంతుని పొందాలి అనే కాంక్ష ముందు కలగాలి. కాంక్ష ఉంటే ఏదో ఉపాయం కనబడుతూ ఉంటుంది. అధికారకాంక్ష ఉంది అనుకోండి వారు మనకోసం ఏదైనా మంచిపనిచేస్తున్నట్లుగా బాహ్యంగా కనబడినా వారికి లోపల దృష్టి అంతా అధికారంపైనే ఉంటుంది. నీకు బ్రెయిన్ లోఏది ఉంటే దానికి అనుగుణంగా సహజంగా పనులు చేసుకొంటూ పోతూ ఉంటావు. ముముక్షత్వం పొందాలి అనే కాంక్ష బలీయంగా ఉంటే దానికి అనుగుణంగా పనులు చేసుకొంటూ వెళ్ళిపోతావు.

ముందు జ్ఞానం గురించి శ్రవణం చేయాలి. కాని మనం అజ్ఞానం గురించి వింటున్నాము. అక్కడకు వెళ్ళాము వాడిచేతిలో నుండి విభూతి రాలుతోంది, ఆయనను తలపెట్టుకొన్నాము ప్రమోషన్ వచ్చేసింది అంటే అది జ్ఞానమా? అది శ్రవణమా? శ్రవణం అంటే ఏమిటో ముందు తెలియాలి. ఏ వస్తువు అయితే అన్నికాలములలోను అన్ని ప్రాంతములలోను తనంతటతానుగా ఉందో, ఏవస్తువును , తెలుసుకొన్నాక నీకు స్వేచ్ఛ కలుగుతుందో అవస్తువు గురించి వింటే అది శ్రవణం. జ్ఞానం సంపాదించాలి అనే కాంక్ష వస్తే ఏ మాటలు వినాలో నీకు తెలుస్తూనే ఉంటుంది. అసలు నీ లక్ష్యం అటుఅయితే, నీ గమ్యం అటుఅయితే దేవుడిని ఎలా ఉపాసించాలి, ఏ గురువును ఆశ్రయించాలి. ఎటువంటి పనిచేస్తే నీకు శాంతి కలుగుతుంది అని నీలోపలనుండే నీమనస్సు చెపుతుంది. ఇతరులను అడుగనక్కరలేదు. జ్ఞానమును సంపాదించాలి అనే కాంక్ష ఉంటే జ్ఞానం సంపాదించుకోవటానికి అదే పెట్టుబడి, దేహ ప్రారబ్ధం ప్రకారం నీవు చేయవలసిన పని ఏదో నిర్మలంగా చెయ్యి. భగవంతుడిని తెలుసుకోవాలి అనే కాంక్ష నిజమైతే నీవు ఏ పని చెయ్యాలో, ఎలా ప్రయాణం చెయ్యాలో ఆ మార్గమును భగవంతుడే నీకు చూపిస్తాడు. కాంక్ష నిజమైతే మార్గం నీకే కనిపిస్తుంది, ఇతరులు చెప్పనక్కరలేదు. నీహృదయంయొక్క లోయలలో నుండే ఆ స్ఫురణ కలుగుతుంది.